# తెగిన చుక్కలు

ప్రెస్సు కాగితాన్ని నమిలేస్తోంది

అర్ధరాత్రి.

చుట్టూ అంతా చప్పుడు. పళ్ళచక్రాల చిత్రమైన రొద.

కాగితపు రోల్‌లో నుంచి పేపర్ మెరుపుతీగలా ఉరుకుతోంది రోల్స్‌లోకి. చకచకా అక్షరాలు కాగితంనిండా ఆకాశంపై చుక్కలవలె అతుక్కుపోయి...వ్చ్...ఎనిమిదేండ్ల నుంచి చేస్తున్నా నీ దినపత్రికలో ...సబ్ ఎడిటర్‌గా చేరి. కుంటుతూ కుంటుతూ యిప్పుడు అసిస్టెంటు ఎడిటరుగా మారి....

ప్రింటయిన కాగితం ఫోల్డింగ్ మెషిన్‌లో నుంచి వురుకుతోంది. రోజూ చూస్తున్నా నీ ప్రాసెస్‌ను, కాని....ఎప్పుడూ తనివి తీరలేదు నాకు.

అలా కాగితం పరుగెత్తడం యంత్రమంతా బెంబేలెత్తినట్టు చటుక్కున కంపిస్తూ చైతన్యాన్ని నింపుకుని ఉద్యమించడం... ఆ ఆవేశం....ఆ చురుకుదనం ఆ కార్యశీలత...

అందుకే ప్రతిరోజూ ఫైనల్‌గా ఫేస్ పేజీ ప్రింటవుతున్నపుడు మెషిన్‌దగ్గరుండి చూస్తానీ వింతను. అలా చూస్తున్నపుడు ఎందుకో నా మనసు ఎగ్జిబిషన్ చూస్తున్న కుర్రాడిహృదయంలా ఎగిరి గంతేస్తుంది.

టైం చూచుకున్నాను.

పన్నెండూ ఐదు.

ఫోర్మన్‌ను పిలిచాను.

"వీక్లీ ఎడిటోరియల్‌ను ఎప్పుడు వేస్తున్నారు?"

"ఉదయం ఐదవుతుందేమో"

"నేను ఐదుగంటలకు వస్తాను మరి. తొమ్మిది గంటలకు వీక్లీ మార్కెట్లోకి వెళ్ళిపోవాలి."

"రైట్సార్."

చకచకా బయటకొచ్చి స్కూటరును తీసుకున్నాను.

నిజానికి నేను అక్కడే ఆఫీసులో ఆ నాలుగ్గంటలసేపూ పడుకోవచ్చు. కాని నేను అన్నిచోట్లా అన్నిపనులనూ చేయలేను. మనకు నెలవున్న కొన్ని స్థలాల్లోనే మనం స్వేచ్ఛగా వుండగలం. నాలా అందరూ వుండరని నాకు తెలుసు అందుకే యింటికి బయలు దేరాను.

సిటీ గాఢనిద్రలో వుంది.

హైద్రాబాదు విశాలమైనరోడ్లు తెల్లకాగితపు తావుల్లా నిర్మలంగా బోసిగా వున్నాయి. రోడ్డుపై రాకపోకలూ కాగితంపై అక్షరాలూ వుంటేనే అందంగా వుంటాయని నేననుకుంటాను.

కింగ్స్‌వే...టాంక్ బండ్—

స్కూటర్ బాణంలా పరుగెత్తుతోంది

నా కళ్ళపై నిద్ర ఉప్పెనలా దాడి చేస్తోంది.

యింకో ఐదు నిముషాల్లో రూమ్ కొచ్చేశాను.

వీధంతా నిర్మానుష్యంగా వుంది. గది బయట స్కూటర్ పార్క్ చేస్తూంటే అలవాటుగా యింటి ప్రక్కవాళ్ళ కుక్కలు మొరిగాయి. గది తాళంతీసి బట్టలు విడుస్తూ రోజూవలెనే ఎదుటి యింటిదిక్కు చూశాను.

లైటు వెలుగుతోంది.

తలుపులు తెరిచేవున్నాయి.

ఆమె ఏదో చేస్తోంది. వెనుకభాగం కనిపిస్తోంది వాళ్లింటి కిటికీలో నుంచి యింతరాత్రి యింకా ఏంచేస్తోందామె మళ్ళీ ప్రశ్న.

యీమధ్య ఆమెగురించి ఆలోచించడం...లోలోపలే తర్కించుకోవడం బాగా అలవాటైపోయింది నాకు.

గమనిస్తూ వుండిపోయాను.

గ్లాసుతో గడగడా మంచినీళ్ళు తాగి నిట్టూర్చింది.

ముఖంనిండా వరదలా చెమట.

కొంగుతో ముఖాన్ని తుడుచుకుని గబగబా బయటికొస్తూ లైటు బంద్ చేసింది. తలుపులు గొళ్ళెంవేసి తాళంవేస్తూ....

ఎక్కడికి వెళ్తోంటీమె

యింతరాత్రి...ఒంటరిగా.

అతనేడి...ఎక్కడికెళ్ళాడు?

బయలుదేరింది భుజాలనిండా కొంగు చుట్టుకుని.

మనిషి మొఖంనిండా ఆందోళన–ఐనా ఆమె మంచులో తడిసిన గులాబీలా వుంది.

ఎందుకో....నా గదినుంచి బయటికొచ్చి నిలబడి ఆమె వెళుతున్న దిక్కు చూస్తూ వుండిపోయాను.

వీధిలో ఎవ్వరూ లేరు.

దీప స్తంబపు వెలుగులో నడచిపోతూ ఆమె....

చీకట్లో నిలబడిచూస్తూ నేను—

మూచుట్టూ నిద్రపోతూ నిలబడ్డ యిళ్ళు.

ఆమె వీధిమలుపు తిరిగింది.

వెనక్కు తిరిగి వచ్చేశాను గదిలోకి.

సిటీల్లో కొన్ని గమ్మత్తు లక్షణాలుంటాయి.

ఒకే వీధిలో ఉంటారు కొందరు. వాళ్ళకు ఒకరి సంగతి యింకొకరికి తెలియదు.

ఒకరి యింటిప్రక్కన ఒకరుంటారు. వాళ్ళెవరెవరో వాళ్ళకు తెలియదు.

ఎప్పుడో ప్రొద్దున లేచి పరుగు అరణ్యంలోకి....పక్షుల్లా.

మళ్ళీ ఎప్పుడో రాత్రి రాక గూట్లోకి....మహానగరాలన్నీ జనారణ్యాలు. ఎవరు ఎవరో...

ఎవ రేం జేస్తున్నారో—

ఎవడు తింటున్నాడో... ఎవడు పస్తులు పడుకుంటున్నాడో... ఎవరెలాంటివారో...ప్చ్....ఎవరికీ తెలీదు.

యిక్కడ 'ఆమె' గురించి కొంత చెప్పాల్సివుంది.

నా గది ఎదురుగా వున్న డాబా మొన్న మొన్నటిదాకా ఖాళీగానే వుండేది

ఓ యిరవై రోజు లైందనుకుంటాను ఆమే, అతనూ అందులో దిగారు.

అతను సినిమా హీరోలా వుంటాడు. ఆమె అతనికి అన్ని విధాలా సరిపోయే హీరోయిన్‌లా వుంది.

మొదట వాళ్ళిద్దరినీ చూచి హృదయపూర్వకంగా "ఏ బెస్ట్ కపుల్" అనుకున్నాను ఆనందంతో. నిజానికి అతని అదృష్టానికి రవ్వంత అసూయపడ్డాను కూడా.

ఓ వారం రోజులదాకా వాళ్ళను పట్టించుకోలేదు

బ్రహ్మచారిని కాబట్టి వీధిలోని మనుషులగురించి యిన్ఫర్మేషన్స్ వచ్చే అవకాశాలు లేవు నాకు.

ఓ రోజున పని కుర్రాడిని అడిగాను వాళ్ళగురించి ఉబుసుపోకకు.

వాడు చెప్పినదాని సారాంశ మేమిటంటే—

వాళ్ళిద్దరూ ఎక్కడినుంచో లేచి వచ్చారు. అతను ఎమెస్సీ. ఆమె బి.కాం. యీ వూరు వచ్చాకనె యిద్దరూ రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నారు.

యీ విషయం విన్నదగ్గరనుంచి నాకు తెలియకుండానే నాలో వారిని స్టడీ చేయాలనే ఆసక్తి పెరిగింది.

కాని నాదో చిత్రమైన తత్వం.

నా అంతట నేను ఓ మనిషితో కల్పించుకుని, చొరవతీసుకుని మాట్లాడలేను సాధారణంగా యితరుల వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోకుండా నా పనేదో నేను చేసుకుపోతూంటాను.

యీ నా పదిరోజుల పరిశీలనలో తేలిందేమిటంటే...అతను వుద్యోగంకోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆమె కూడా అదేపనిలో

వుంది. యీ లోగా ఆమెపైవున్న అతితక్కువ బంగారం రూపా యలుగా మారి ఆహారపదార్థంగా రూపాంతరం చెందుతోంది.

వారంరోజుల క్రితం అతను కనిపించాడు. గడ్డం పెరిగివుంది. బట్టలు కూడా మాసినాయి. యిదివరకు తుడిచిన అద్దంలా అనిపించిన మనిషి అప్పుడు మసిబారిన గాజుపలకలా కనిపించాడు. అతని కళ్ళలో అదో రక్తమైన శూన్యం కనిపించింది.

జాలేసింది అతనిపై. పలకరిద్దామనుకున్నాను.

కాని పలకరించలేదు.

తర్వాత నా పని రద్దీ ఎక్కువైపోయింది. వీక్లీ ప్రత్యేక సంచి కను తయారుచేయడంలో మునిగిపోయాను.

కాని ప్రతిరాత్రి ఆమెకోసం కిటికీలోనుంచి చూసేవాడిని అప్రయత్నంగానే.

రాత్రి పదిగంటలుదాటి ఆ వేళకూడా ఆమె గదిలో లైటు వెలుగుతూ....ఏం జేస్తూంటుందామె అంత రాత్రిదాకా?

మొన్న ఓసారి అతను మంచంలో వెల్లకిలా పడుకుని వుంటే... ఆమె అతని కాళ్ళు పిసుకుతూ, ఛాతీపై రుద్దుతూ సపర్యలుచేస్తూ కని పించింది.

నాకు వాళ్ళిద్దరిపై చివరకు మిగిలింది ఒట్టి జాలి.

వాళ్ళు తొందరపడి లేచివచ్చారనీ, యిద్దరిలో ఎవరో ఒకరు ఉద్యోగంలో చేరి స్వయంగా నిలబడగలిగినపుడే వాళ్ళీపని చేయాల్సిం దనీ అనిపించేది నాకు యీ భావన వాళ్ళపట్ల యింకా ప్రగాఢమైన సాను భూతిని చిగురింపజేసింది.

అలాంటిది యివ్వాళ... యింత రాత్రి ఆమె ఒంటరిగా బయలు దేరి...

ఎటు వెళ్ళిం దామె?

అత నేమైనాడు?

ఒంటరిగా.... యింత రాత్రి ఓ ఆడది...అందులో అందమైన ఆడది, యీ దేశంలో ఎలా క్షేమంగా వెళ్ళ గలుగుతుంది?

నేనిప్పుడు బయలుదేరి వెళ్ళి ఆమెకు సహాయపడితేనో_

కాని ఎలాంటి సహాయం...?

అసలు ఆమె ఎవరు?...తనెవరు?

ఏమని ఆమెను సందర్శించ గలడు తనసలు.

...ప్చ్...

ఆలోచేస్తూండగానే ఎప్పుడో నిద్ర నన్ను ఓడించింది.

మళ్ళీ చటుక్కున తెలివొచ్చి టైం చూచుకుంటే నాల్గు దాటింది.

గబగబా లేచి లైటేసి వీక్లీకి రాయాల్సిన ఎడిటోరియల్ రాస్తూ కూర్చున్నాను.

సగం రాశాననుకుంటాను .... బయట వీధి గుమ్మం తలుపు చప్పుడైంది.

....ఎవరై వుంటారు?...చెవి వటుంచి రాసుకుపోతూనే వున్నాను.

మళ్ళీ తలుపుపై గొళ్ళెం చప్పుడు.

లేచి తలుపులు తెరిచాను.

ఎదురుగా ఆమె....భుజాలనిండా కొంగు కప్పుకుంది.

ఆశ్చర్యపోయాను.

"ఏమిటి...." అన్నాను.

"మీ స్కూటర్ పైన లిఫ్ట్ యివ్వగలరా?" అంది.

"ఎక్కడి కెళ్లాలి మీరు" అన్నాను

"సికింద్రాబాద్"

"ఎందుకు?" అని అనబోయాను. కాని అనలేదు. అనలేకపోవడం నా తత్వం కం బలహీనత.

"కూర్చోండి యిలా.... నేనుకూడా ఎలాగూ అటే వెళ్లాలిప్పుడు. డ్యూటీ టైమైంది కూడా—" అన్నాను. అని చకచకా బట్టలుతీసుకోవడంలో పడిపోయాను.

ఆమె లోపలకొచ్చి కూర్చోలేదు. బయటనే నిలబడి వుంది తల వంచుకుని.

స్కూటర్ బయటికి తీసి.... స్టార్ట్‌చేసి—

ఆమె కూర్చుంది వెనుక.

నాకా అనుభవం అతికొత్తగా వుంది. చుట్టూ చూశాను గిల్టీగా.... ఎవ్వరైనా చూస్తున్నారా అని.

లిబర్టి దాటి.... టాంక్‌బండి ఎక్కి. స్కూటర్ ఆకాశంనుండి రాలిపోతున్న చుక్కలా పరుగెత్తుతోంది.

ఆమెతో ఏదో మాట్లాడాలనిపిస్తోంది. కాని మాట్లాడలేకపోతున్నాను.

నిశ్శబ్దంగా ఆలోచిస్తున్నాను... ఆమెకు సికింద్రాబాదులో ఏమి పని... అదే యిప్పుడు... యీవేళప్పుడు... అసలీమె అప్పుడు పన్నెండు గంటలకు ఎటెళ్లింది మళ్లీ ఎప్పుడొచ్చింది. యిప్పుడు ఎందు కెళ్తోంది. యివన్నీ.

వెనుక సీట్‌ను పట్టుకున్న ఆమె చెయి మెల్లిగా తగుతోంలుది.

నా మనసుకు కేంద్రం అక్కడ స్థిరపడింది క్షణం.

కింగ్స్‌వే దాటి...క్లాక్ టవర్ దాటి, సికిందరాబాద్ స్టేషన్ దిక్కు దూసుకుపోతూ—

యింతసేపూ ఆమే నేనూ ఒక్క ముక్కయినా మాట్లాడుకోలేదు.

"యిక్కడాపండి" అంది.

ఆపాను.

మే మాగింది గాంధి హాస్పిటల్‌కు దగ్గర ఓ లాడ్జింగ్ ముందు.

ఆమె దిగింది.

దిగి భుజంచుట్టూ కొంగును చుట్టుకుంటూ "మిమ్మల్నొకటడుగుతాను అంది.

"అడగండి" అన్నాను చాలా చనువుగా.

"మీరు...మీరు నన్ననుభవించి ఓ నూర్రూపాయ లివ్వగలరా?" అంది తలవంచుకుని.

నిజంగా నా తలపై ఓడైనమైట్ పడి బ్రద్ధలై వట్టవిపించింది.

ఏమని చెప్పాలి జవాబు.

ఏమని... ఏమని...

ఘర్షణ... ఘర్షణ.

"ఎందుకు మీకా డబ్బు..."

"యిలా చేయడంవల్ల మీతోనే నేను కళంకిని అవుతున్నానని మీరు ఫీల్‌కావద్దు. ఒకసారి కలుషితమైన దాన్ని ఎన్నిసార్లు బురదలో పడ్డా ఒకటే... యిప్పుడు నా శీలంకంటే నా కతని ప్రాణం ముఖ్యం. చెప్పండి...మీరు నన్నుపయోగించుకుని నూర్రూపాయలివ్వగలరా?..."

నా సంస్కారం....నాలోని వివేకం... అన్నీ ప్రశ్నిస్తున్నాయి మౌనంగా.

ఆమె ముఖంలోకిచూశాను నిశ్శబ్దంగా. మనిషి అమ్ముడుపోయిన హరిశ్చంద్రుడి భార్యలా వుంది.

గబగబా పాకెట్టుతెరచి నూర్రూపాయలనోటు అందించబోయాను.

"ఏ హోటల్ కెళ్దామంటారు...'' అంది.

"అక్కర్లేదు... వుంచండి'' అన్నాను'

ఆమె నోటును తీసుకోలేదు. అతి దీనంగా, సముద్రాలెగిసిపడు తున్న కళ్లతో నావంక చూచి నిశ్శబ్దంగా వెళ్లిపోయింది హాస్పిటల్ దిక్కు. పిలవాలనుకున్నాను...కాని పిలవలేక పోయాను.

చేతిలో నోటూ...

వెళ్ళిపోతూ ఆమె

చూస్తున్నాను విస్పహాయంగా.

మనసెందుకో పగిలిన అద్దంలా తయారైంది. స్కూటర్ స్టార్ట్ చేసి ఆఫీసుకు పోనిచ్చాను.

ఎడిటోరియల్ పూర్తిచేశాను.

వీక్లీ ఫ్రంట్ పేజీ ప్రింట్ చేయించాను. అన్నీ పూర్తిచేసి పత్రికను మార్కెట్‌కు ఫీడ్ చేసేప్పటికి ఉదయం పది దాటింది.

యిన్ని గంటలసేపూ ఆమెగురించే ఆలోచన.

నూర్రూపాయ లెందుకు ?

ఓ ఆడది శీలాన్నమ్ముకోడానికి సిద్ధపడి డబ్బడుగుతోందంటే ఆ అవసరం ఎలాంటిదై ఉంటుంది ? పరిస్థితులు ఎంత ఘోరంగా వుండి వుంటాయి.

కాని తను డబ్బిస్తే ఎందుకు తీసుకోలేదామె.

ఊర్కే తీసుకుంటే అది బిచ్చమెత్తుకోవడంగా భావిస్తోందా ఆమె ?

కాని ప్రతిగా ఆమె యిస్తానన్నది....ఎం నీచమైన పనది.

కాని ఆమె దగ్గర యింకేమున్నది యివ్వడానికి అదిగాక ?

యిప్పుడామె ఎక్కడుందో ?

తొందర తొందరగా యింటిదిక్కు పోనిచ్చాను స్కూటర్‌ను.

వీధి మలుపు తిరగ్గానే...నా గదిఎదుటి యింటిముందరంతా జనం గుమిగూడి కనిపించింది...

ఏం జరిగింది?

ఆమేదైనా అఘాయిత్యం చేసుకోలేదుగదా?

స్కూటర్‌కు స్టాండేసి గబగబా పరుగెత్తాను.

ముందు గదిలో అతని శవంవుంది తెల్లగుడ్డలో. ప్రక్కనే ఫ్యాన్‌కు వేలాడుతూ...మెడకు ఉరిపోసుకుని ఆమెశరీరం.

"భర్త చనిపోయాట్ట దవాఖాన్లో-పొద్దున్నే శవాన్నింటికి తెచ్చి అయన్లేని బతుకు తనకెందుకని ఉరెట్టుకుందటమ్మా పున్యాత్మురాలు..." అంటోందో ఆడది ప్రక్కమనిషితో.

ఆమె కాళ్ళదగ్గర కుర్చీపై ఓ కాగితం మడిచివుంది రాయి బరువుతో. దాన్నెవరూ తాకినట్టులేదు అంతదాకా.

వెళ్ళి కాగితాన్ని విప్పాను.

"వయసుకు ఆవేశముంటుంది. ఆదర్శాలుంటాయి. కాని ఆలోచనుండదు. కులమతాలకు అతీతంగా ఎదిగి ఓ అపురూప జంటగా నిలిచిపోదా మనుకున్నాం. కాని మేము నమ్ముకున్న మా డిగ్రీలు మాకు

పిడికెడు మెతుకులను పెట్టలేకపోయాయి. మేం చేసింది పొరపాటు. మనిషికి ఆర్థికంగా తన కాళ్ళపై తను నిలపడగలిగే శక్తి వుంటేగాని ప్రేమించే హక్కు వుండకూడదు. ఉద్యోగం లేనివాళ్ళకు ప్రేమించే అధికారం లేదు. వుందనుకుని భ్రమలో తప్పుచేస్తే...యిదిగో మా పొరపాటు మా జీవితాల్ని బలితీసుకుంది."

ఆమె శవం వంక చూశాను.

నిశ్శబ్దంగా తలవంచుకున్నాను.

మనసునిండా అంతా శూన్యం....శూన్యం...